క్లుప్తంగా

వ్యాధులపై అవగాహన



ముగ్గళ్లలో సర్వే చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ నగేష్ బాబు తదితరులు

సీతానగరం: మండలంలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ముగ్గళ్ల రామాలయం వీధిలో హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్ బాబు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దానివల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందుతాయని, అనేక రకాల వ్యాధులకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ ఆర్ఐగా రామిరెడ్డి

మధురపూడి: కోరుకొండ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మిర్తివాడ రామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన జగ్గంపేట నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఏజెన్సీలోని పిడిత మామిడి గ్రామానికి చెందిన రామిరెడ్డి బుధవారం విధుల్లో చేరారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో విధులు నిర్వర్తించారు.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన యర్రమల సత్యాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త గోపీనాథ్‌రెడ్డిపై కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఏఎస్సై జి.విష్ణుచక్రారెడ్డి శుక్రవారం తెలిపారు. బొబ్బిల్లంకకు చెందిన సత్యాదేవికి ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం సత్యవేడు గ్రామానికి చెందిన గోపీనాథ్‌రెడ్డితో 2021 అక్టోబర్‌లో వివాహమైంది. భార్య ఉండగానే సత్యాదేవిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే ఇటీవల సత్యాదేవిని కట్నం కోసం భర్తతో పాటు అత్త ప్రభావతి, మావ వెంకటరెడ్డి వేధిస్తున్నారు. అలాగే వేరే అమ్మాయిని వివాహం చేసుకుంటానని కూడా గోపీనాథ్‌రెడ్డి బెదిరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జపమాల ప్రార్థనలు

మధురపూడి: ఆర్‌సీఎం క్రైస్తవులు నిర్వహిస్తున్న జపమాల ప్రార్థనలు కొనసాగుతున్నాయి. ఏసుక్రీస్తు తల్లి మేరీమాతను స్మరించుకుంటూ అక్టోబర్‌లో వీటిని నిర్వహిస్తారు. ఈ నెల ఒకటిన జపమాల ప్రార్థనలు మొదలయ్యాయి. ప్రపంచంలో యుద్ధాలు ఆగాలని, శాంతి ఏర్పడాలని, ప్రజలను ఆరోగ్యంగా ఉండాలంటూ ప్రార్థనలు చేస్తున్నారు. కోరుకొండ, బూరుగుపూడి, కాపవరం తదితర గ్రామాల్లో ఆర్సీఎం చర్చిల్లో జరుగుతున్నాయి. ఉపదేశులు బెల్లపు డేవిడ్, కొల్లి జాకబ్‌రాజు, మేరీ పుష్ప, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి



రామవరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రెండు రోజులు ముందుగానే అనపర్తి మండలం రామవరం గ్రామంలో ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో సుమారు రూ.14 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. రామవరంలో రూ.4.50 కోట్లు, మహేంద్రవాడలో రూ.38.30 లక్షలు చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు.

నేడు అభిషేకాలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని దత్తసాయి ఆలయంలో శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ వి.జానకి రామ సుబ్బారావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ విజయ దశమి పర్వదినం సందర్భంగా ఉదయం 8 నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. బాబా అవతార సమాప్తి చెందిన విజయ దశమి రోజు ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం ఆలయం వద్ద మహాన్నదానం, రాత్రికి సామూహిక భజనలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

సహకారానికి తూట్లు

- పీఏసీఎస్‌లలో నిధుల దుర్వినియోగం
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- దెబ్బతింటున్న సహకార వ్యవస్థ

రాజానగరం: వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చి, అభివృద్ధి పథంలో పయనింపజేయాలనే సంకల్పంతో ఏర్పడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆలనా పాలనకు దూరమయ్యాయి. దీనితో కొన్నింటిలో విధులు నిర్వర్తిస్తున్న వారు, నామినేటెడ్ పోస్టులు పొందిన వారు కుమ్మక్కై, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు అన్నదాతల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పర్యవేక్షణలో గ్రామీణ స్థాయిలో పని చేస్తున్న వ్యవసాయ సహకారం పరపతి సంఘా (సొసైటీ)లకు పాలక వర్గాలను ఎన్నికల ద్వారా సభ్యులు (రైతులు) ఎన్నుకుంటారు. అయితే దశాబ్దాకాలంగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. నామినేటెడ్ బాడీలను ఏర్పాటు చేసి, పాలనాపరమైన అంశాలను తూతూ మంత్రంగా నడిపిస్తూ, సహకార వ్యవస్థకు తూట్లుపడేటట్లు చేస్తున్నారు.

వెదుళ్లపల్లి సొసైటీలో..



నందరాడ సొసైటీ పాత భవనం. దీన్ని కూల్చి కొత్త భవనం కడతామంటూ ఐదేళ్లుగా అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు

నియోజకవర్గంలో 19 వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వాటిలో కొన్ని సంఘాలను అవినీతి ఆరోపణలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీతానగరం మండలం వెదుళ్లపల్లి సొసైటీలో రూ.64 లక్షల మేరకు నిధుల దుర్వినియోగం అయినట్టుగా ఆ శాఖ అధికారులు గుర్తించారు. దానిలో విచారణ జరిపి సీఈఓతో పాటు మరో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. ఆ సొసైటీలో పాలనాపరమైన కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా తాత్కాలికంగా ఏర్పాట్లు కూడా చేశారు.

శ్రీరంగపట్నంలో..

శ్రీరంగపట్నం సొసైటీలో కూడా భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు రావడంతో ప్రత్యేకాధికారితో విచారణ నిర్వహించారు. ప్రాథమికంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని సస్పెండ్ చేసి, పోలీసు కేసు కూడా నమోదు చేశారు. విచారణ ఇంకా కొనసాగుతోంది.

నందరాడలో..

రాజానగరం మండలం నందరాడ సొసైటీ తీరుపై కూడా కొందరు రైతులు ధ్వజమెత్తారు. గత మార్చి, ఏప్రిల్ నెలలో 7 శాతం వడ్డీ చెల్లించి, రశీదులు తీసుకున్నాగానీ సిబ్బంది మాత్రం ఇంత వరకూ తమ రుణాలను రెన్యువల్ చేయకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు 13 శాతం వడ్డీతో చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గత నెలలో సొసైటీలో నిర్వహించిన మహాజన సభకు సభ్యులు గైర్హాజరు కావడంతో కోరం లేక సభ వాయిదా పడింది.

అనేక ఆరోపణలు

ఇలాంటి పరిస్థితులలో సహకార సంఘాల పనితీరుపై అనేక రకాల ఆరోపణలు వస్తున్నాయి. విమర్శలు ఎదుర్కొంటున్న సొసైటీలతో పాటు ఇతర సొసైటీలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని రైతులు కోరుతున్నారు. అప్పుడే అవినీతి, అక్రమాలు బయటపడతాయని చెబుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే కొందరు సభ్యులు ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు కూడా అందజేశారు.

నష్టాల బాట

నందరాడ సొసైటీ రైతుల కోసం కాదన్నట్టుగా నడుస్తోంది. ఈ కారణంగానే సుమారు రూ. 10 కోట్ల మేరకు ఓవర్ డ్యూతో నష్టాలతో సాగుతోంది. దీనికి గల కారణాలేమిటని లోతుగా విచారిస్తే, ఇక్కడ జరిగిన, జరుగుతున్న అవినీతి బాగోతం అంతా బట్టబయలు అవుతుంది. గతంలో సుమారు రూ.20 లక్షల వరకు అవినీతి జరిగితే రూ.12 లక్షలు రికవరీ చేశారు. మిగిలిన రూ.8 లక్షలు ఎప్పుడు చేస్తారంటే జవాబు లేదు. 2019లో నిర్మించిన సొసైటీ భవనం ఎంతో పటిష్టంగా ఉంది. కానీ దాన్ని కూల్చివేసి, కొత్త భవనం కడుతామంటూ ఐదేళ్లుగా అద్దె భవనంలో కాలం గడిపేస్తున్నారు.

– అడబాల గణపతిరావు, రైతు, సీతారామపురం

అవినీతిని బయటకు తీస్తాం

సొసైటీలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను బయటకు తీస్తాం.ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి అన్ని సొసైటీలలో విచారణ నిర్వహిస్తాం. నియోజకవర్గంలోని 10 సొసైటీలలో నిధులు దుర్వినియోగమయ్యాయని, వాటిపై విచారణ జరిపించాలని రైతులు కోరుతున్నారు. సకాలంలో పాలక వర్గాలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే సిబ్బందికి ఇది ఒక అవకాశంగా చిక్కింది.

– బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే, రాజానగరం

ఆరోపణల్లో వాస్తవికత లేదు

నందరాడ సొసైటీ విషయమై వచ్చిన ఆరోపణలలో వాస్తవికత లేదు. కొందరు సభ్యుల పేరిట వచ్చిన విమర్శలపై స్వయంగా విచారణ చేశాను. ఎక్కడా ఎటువంటి ఆధారం కనిపించలేదు. సభ్యులు కట్టిన రుణాలు, వడ్డీలు సక్రమంగానే జమ అయినట్టుగా రికార్డులు చెబుతున్నాయి. అయితే ఆరోపణలు చేసిన వారిలో కొందరు అసలు సభ్యులే కారు. వారు ఎందుకు ఆ విధంగా విమర్శలు చేశారో వారికే తెలియాలి. ఇక మిగిలిన వారిలో డిపాల్టర్లే ఎక్కువగా ఉన్నారు.

– బదిరెడ్డి లక్ష్మి, మేనేజర్, డీసీసీబీ, రాజానగరం బ్రాంచ్

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు

- మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి
- బాలికా దినోత్సవంలో కలెక్టరు ప్రశాంతి

రాజానగరం: ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో మెలగాలని, అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కిశోర బాలికలతో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు కోసం అమ్మాయి దృష్టి సారించాలనే నినాదంతో ఈ ఏడాది అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. ఆడది అంటే అబల కాదు ఆదిపరాశక్తి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని, ఆడవారి హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించాలన్నారు. దసరా ఉత్సవాలలో జగన్మాతను తొమ్మిది రోజులు, తొమ్మిది రూపాలలో పూజిస్తారన్నారు. దానికి గల కారణాన్ని బాలికలకు వివరించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు 'అష్టలక్ష్మి' నృత్య ప్రదర్శన చేశారు. వారిని కలెక్టర్ అభినందించారు. స్త్రీ అంటేనే శక్తి స్వరూపిణి అన్నారు. మహిళలు తమలోని శక్తిని గ్రహించినప్పుడే తాము ఎంచుకున్న రంగాలలో ఉన్నత శిఖరాలను అందుకుంటారన్నారు. ఆడపిల్లల్లోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యుడు జె.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బాలురతో పాటు బాలికలకు హక్కులు సమానంగా ఉంటాయన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి కె.విజయ కుమారి మాట్లాడుతూ 'బేటీ బచావో, బేటీ పడావో' కార్యక్రమంతో కేంద్ర ప్రభుత్వం బాలికల రక్షణకు, విద్యాభ్యాసానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు మాట్లాడుతూ విద్య ద్వారానే ప్రగతిని సాధించవచ్చన్నారు. తొలుత ప్రాజెక్టు కార్యాలయ ప్రాంగణంలో కలెక్టరు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.లక్ష్మీలావణ్య, సీడీపీఓ టి.నాగమణి, సర్పంచ్ కుండేటి ప్రసాద్, కూటమి నాయకులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



'అష్టలక్ష్మి' నృత్య ప్రదర్శన చేసిన బాలికలతో కలెక్టరు ప్రశాంతి, ఇతర అధికారులు

ఆ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండి

స్థానిక సాయిబాబా గుడి సమయంలోని జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన బాలికల దినోత్సవానికి హాజరైన ఆమెను ఆ కాలనీకి చెందిన మహిళలు కలుసుకుని తమ అవస్థలు వివరించారు. అప్పులు చేసుకుని ఇళ్లు నిర్మించుకున్నామని, గృహ ప్రవేశాలు కూడా పూర్తయ్యాయని, కానీ తమ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని వాపోయారు. దీంతో చీకట్లోనే దోమలతో అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఆ సమయంలో పక్కనే తహసీల్దారు ఎం. లక్ష్మీలావణ్య కలుగజేసుకుని, ఆ స్థలాలు కోర్టు కేసుల్లో ఉన్నాయని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ ఇవ్వకపోవడం సరికాదని, కోర్టులో ఉంటే మాత్రం కట్టుకున్న ఇళ్లకు విద్యుత్ ఇవ్వడం మానేస్తారా అని ప్రశ్నించారు. వెంటనే ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఏఈకి చెప్పాలని తహసీల్దారును ఆదేశించారు.

జయ జయహే మహిషాసురమర్దిని



కాపవరం రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



గాడాల గ్రామంలో అమ్మవారు



రాపాక పంచాయతీ శ్రీరామనగరం ఆలయంలో అమ్మవారు

మధురపూడి: దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శుక్రవారం మహిషాసురమర్దినిగా అలంకరించారు. కోరుకొండ మండలం కాపవరం రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం దర్శించుకున్నారు. కాపవరం రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో 34 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జీ, ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పచ్చారి వెంకట రమణ, ఉపాధ్యక్షులు నల్లమిల్లి సత్తిబాబు, కాలచర్ల శ్రీను, కనుబొజ్జు సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

గాడాల గ్రామంలో..

కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయంలో భవానీ మాలధారణ చేసిన భక్తులు పడిపూజ నిర్వహించారు. మహిషాసురమర్దిని అలంకరణలో ఉన్న అమ్మవారిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి దర్శించుకున్నారు. కాపవరం, దోసకాయలపల్లి, బూరుగుపూడి, నర్సాపురం, గాదరాడ గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు జరుగుతున్నాయి.

వైభవంగా దసరా ఉత్సవాలు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ, రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరం, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, కాటవరం గ్రామాలలో ఆలయాలకు భక్తులతో పోటెత్తారు. మండలంలో సుమారు 13 వేల మంది వరకూ భవానీ మాలధారణ చేశారు. వీరిలో చాలామంది కాలినడకన విజయవాడకు వెళుతున్నారు. కాగా.. దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శుక్రవారం మహిషాసురమర్దినిగా అలంకరించారు.

బిక్కవోలు/పెదపూడి/రంగంపేట: అనపర్తి నియోజక వర్గంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు శుక్రవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు పోటెత్తారు.



సంపరలో మహిషాసురమర్దినిగా అమ్మవారు



జి.మామిడాడ మణికంఠ స్వామి ఆలయంలో అమ్మవారు



తొస్సిపూడిలో అమ్మవారు



చంద్రేడులో కనకదుర్గమ్మ



రంగంపేటలో మహిషాసురమర్దినిగా అమ్మవారు

భీమేశ్వరుని సేవలో మాజీ ఎమ్మెల్యే దంపతులు



భీమేశ్వరుడిని దర్శించుకుంటున్న సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకుని మానసిక ప్రశాతంత పొందాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ద్రాక్షరామంలోని మాణిక్యాంబ దేవి సమేత భీమేశ్వర స్వామి దేవాలయాన్ని సత్తి సూర్యనారాయణరెడ్డి ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి పండితులు ఆశీర్వచనాలు అందించారు. ముందుగా ద్రాక్షారామంలో తోటపేట గణేష్ రైసుమిల్లు, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు రూ.2 కోట్లతో నిర్మించిన భీమేశ్వరస్వామి అన్నదాన భవనాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రామ్‌గోపాలరెడ్డి, మెళ్లూరు లాయర్ శ్రీనువాసు, పాలమూరు సివిల్ కాంట్రాక్టర్ నల్లమిల్లి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.17.25 కోట్లతో మౌలిక వసతులు



కాపవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

మధురపూడి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రూ.17.25 కోట్లతో డ్రైనేజీలను నిర్మించనున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం కోరుకొండ ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పల్లె పండుగ కార్యక్రమంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి పనులు ప్రారంభమవుతాయని, డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంగా ఉన్నామన్నారు. చాలా గ్రామాల్లో శ్మశాన వాటికలకు రోడ్లు లేవన్నారు. నియోజకవర్గంలోని 74 పంచాయతీల్లో పనులు జరుగుతాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బత్తుల అశోక్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ బాబు, పంచాయతీ రాజ్ డీఈ రవికుమార్, సీతానగరం, రాజానగరం ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ జీవనాధారం చూపించండి

మధురపూడి: తమకు ప్రత్యామ్నాయ జీవనాధారం కల్పించాలని ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మన్లు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ప్రకారం షాపులన్నీ ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోకి వెళతాయి. దీంతో వీరందరూ ఉపాధి కోల్పోతారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో వీరికి ఈ ఉద్యోగాలు వచ్చాయి. ఈ నెల 16వ తేదీ తర్వాత వీరందరూ రోడ్డున పడతారు. కోరుకొండ మండలంలోని ఐదు షాపుల్లో పనిచేస్తున్న సుమారు 30 మంది జీవనోపాధి కోల్పోతారు. ఈ మేరకు వీరందరూ తమ సమస్యపై కోరుకొండ సీఐ శ్రీనివాస బాలాజీకి వినతి పత్రం అందించారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

రాజానగరం: శరన్నవరాత్ర ఉత్సవాలలో భాగంగా దివాన్ చెరువు పాతూరులోని బాలవికాస్ విద్యా మందిర్ సమీపంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద శుక్రవారం రాత్రి లక్ష దీపోత్సవం నిర్వహించారు. అన్నందేవర బ్రహ్మం, సుంకర దొరబాబు సహకారంతో ఆ ప్రాంతంలోని బాల బాలికలు, మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు.

11 మద్యం దుకాణాలకు 399 దరఖాస్తులు



శ్రీనివాస బాలాజీ, ఎక్సైజ్ సీఐ

మధురపూడి: కోరుకొండ ఎక్సైజ్ సీఐ కార్యాలయం పరిధిలోని 11 మద్యం దుకాణాలకు దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.7.98 కోట్లు ఆదాయం వచ్చిందని సీఐ జె.శ్రీనివాస బాలాజీ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం దుకాణాల నిర్వహణ కోసం శుక్రవారం సాయంత్రం వరకూ దరఖాస్తులను స్వీకరించారన్నారు. కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల పరిధిలో 11 దుకాణాలకు 399 దరఖాస్తులు వచ్చాయని, వాటి ధరావత్తుగా రూ.7.98 కోట్లు వచ్చాయన్నారు. రాజమహేంద్రవరంలోఈ నెల 14వ తేదీన డ్రా తీసి, విజేతలకు షాపులు కేటాయిస్తారన్నారు.